## విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.04-04-2018.**

# దారి తప్పుతున్న బాలలకు “ఆపరేషన్ ముస్కాన్” ద్వారా మంచి భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తున్న విజయవాడ నగర పోలీస్ శాఖ

***62 మంది అనాధ వీధి బాలలు మరియు బాల కార్మికుల గుర్తింపు***

తల్లిదండ్రుల నిరాధరణకు, నిర్లక్ష్యానికి గురైన వారు అలాగే ఊహ తెలియని వయస్సులో తప్పిపోయిన బాలలు సరైన పర్యవేక్షణ లేకపోవడం కారణంగా చెడునడతకు త్వరగా ఆకర్షించబడి నేరస్థులుగా, సంఘ వ్యతిరేక శక్తులుగా మారడం, దోపిడీకి గురికావడం, మత్తు పానియాలు, పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన **“ఆపరేషన్ ముస్కాన్”** కార్యక్రమంలో భాగంగా విజయవాడ పోలీస్ శాఖ అనాధ వీధి బాలలు మరియు బాల కార్మికులను అదే విధంగా వివిధ కారణాల వలన ఇంటి నుండి బయటకు వచ్చిన వారిని గుర్తించడం జరుగుతోంది. అనంతరం వారి పూర్తి వివిరాలు తెలుసుకుని తల్లి దండ్రుల పర్యవేక్షణ లేక నిర్లక్ష్యానికి గురైన వారు, అలాగే వివిధ ప్రాంతాల నుండి నగరానికి చేరుకున్న బాలలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం, తల్లి దండ్రులు లేని బాలలను ప్రభుత్వ ఆర్గనైజేషన్‌లకు అప్పగించి చర్యలు తీసుకుంటున్న విషయం విధితమే.

ఈ క్రమంలో ది.04.04.18న పోలీస్ కమీషనర్ గారి ఆదేశాల మేరకు విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో “ఆపరేషన్ ముస్కాన్” నిర్వహించి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఉండి కూడా నిరాధరణకు, నిర్లక్ష్యానికి గురై నగరానికి చేరుకున్న బాలబాలికలు రోడ్లపైన, ఫుట్‌పాత్‌లపైన నిద్రిస్తు, ఊహ తెలియని వయస్సులో తప్పిపోయిన పిల్లలు, అలాగే అనాధ బాలబాలికలు మొత్తం 62 మందిని రైల్వేస్టేషన్, పండిట్‌నెహ్రూ బస్‌స్టాండ్, హోటళ్ళు, మార్కెట్లు, రద్దీ కూడళ్ళు, వాణిజ్య సముదాయాల వద్ద గుర్తించడం జరిగింది. ఇందులో 61మంది బాలురు, బాలికలు-1 ఉన్నారు. వీరిలో 47 మంది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, తెలంగాణా రాష్ట్రానికి చెందిన-1 బాలిక, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారు-3, రాజస్థాన్‌కు చెందిన వారు-9 మంది మరియు మహారాష్ట్రకు చెందిన వారు -1 ఉన్నారు.

ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారు మాట్లాడుతూ... బాలల హక్కుల పరిరక్షణ మరియు వారికి మంచి భవిష్యత్ అందించడం ద్వారా వారి జీవితాలు బాగుపరచాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు విజయవాడ పోలీస్ శాఖ చర్యలు తీసుకుకోవం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో బాలల పరిరక్షణ కోసం ప్రతి పోలీస్‌స్టేషన్‌లో బాలమిత్రను ఏర్పాటు చేయడంతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించడం తద్వారా సమాజంలో వీధి బాలలు మరియు బాలకార్మిక వ్యవస్థను రూపు మాపేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో బాలమిత్రలో భాగంగా ప్రభుత్వం తరపున పోలీస్ శాఖ నగరంలో పలు మార్లు “ఆపరేషన్ ముస్కాన్” నిర్వహించడం జరిగిందని, తద్వారా గతంతో పోల్చితే ప్రస్తుతం వీధి బాలలు మరియు బాలకార్మిక వ్యవస్థ చాలావరకు తగ్గుముఖం పట్టిందన్నారు. ప్రస్తుతం పోలీసులు గుర్తించిన బాలలను ఒకొక్కరిపై ప్రత్యేక శ్రద్ధ వహించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. గుర్తించిన బాలల కుటుంబ నేపథ్యం, ఇంటి నుండి బయటకు వచ్చిన కారణాలు, సంక్షేమం తదితర పూర్తి వివరాలు తెలుసుకున్న అనంతరం వారిని సి.డబ్ల్యూ.సి. వారికి అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఇతర స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖల సహకారం తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రచార మాధ్యమాలు కూడా తమ వంతు భాగస్వామ్యం మరియు సహకరించి విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

*(మిగతా 2వ పేజీలో ...)*

ది.4.4.18న పోలీసులు గుర్తించిన బాలలు ఇంటి నుండి బయటకు రావడానికి అదే విధంగా వాణిజ్య సముదాయాల్లో, హోటళ్ళలో, బార్ & రెస్టారెంట్‌లలో పని చేయడానికి దారి తీసిన పరిస్థితులు, వారి కుటుంబ నేపథ్యం, చదువుకోవాలని కోరిక ఉన్నా సరైన ఆర్థిక ఆసరా, ఆధరణలేని కొంత మంది వివరాలు ఈ క్రింది విధంగా ....

➩ మల్లిఖార్జున్ (11 సం॥) :-హనుమాన్‌పేట కాలువగట్టు పరిసర ప్రాంతంలో సంచరించే మల్లి ఖార్జున్ (11) తండ్రి కొంత కాలం క్రితం చనిపోయాడు. తల్లి భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగింస్తుంది. కుటుంబ పర్యవేక్షణ లేకపోవడంతో హనుమాన్‌పేట, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ చెడు సహవాసాలు పట్టి సొల్యూషన్ తదితర మతుపద్దాలకు అలవాటుపడ్డాడు. (ఫొటో నెం.852)

➩ జాంతీలాల్ (8 సం॥) :- రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన జాంతీలాల్‌కు చదువుకోవాలని శ్రద్ధ ఉన్నప్పటికి ఇంట్లో తల్లి దండ్రులు ఆధరణలేకపోవడంతో 3వ తరగతిలోనే చదువు ముగించాడు. తన సోదరుడు విజయవాడ కొండపల్లి పరిసర ప్రాంతంలో ఒక హోటల్‌లో పనిచేస్తున్న తన సోదరుడు పిలుపుమేరకు జాంతీలాల్ ఒక్కడే రాజస్థాన్ నుండి కొంత కాలం క్రితం విజయవాడ చేరుకుని రోడ్లపై తిరుగుతున్నాడు. (ఫొటో నెం. 851)

➩ చందు (12 సం॥) :- నైజాం గేటు ప్రాంతానికి చెందిన చందు తండ్రి మృతి చెందగా తల్లి పాత బట్టలు విక్రయిస్తూ జీవిస్తుంది. ఇంట్లో పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్లపై తిరిగేందుకు అలవాటుపడ్డాడు. (ఫొటో నెం. 849)

➩ జగన్నాధం నాగతేజ (16 సం॥) :- 6వ తరగతి వరకు చదివి మానేసిన నాగతేజ తల్లి దండ్రులు కొద్ది కాలం క్రితం మృతి చెందడంతో విజయవాడ కనకదుర్గ వారధి సమీపంలో ఉండే తన అక్క, బావల వద్ద ఉంటున్నాడు. తల్లి దండ్రులు మృతి చెందడం, అక్క బావలు పట్టించుకోకపోవడంతో రోడ్లపై తిరిగేందుకు అలవాటుపడ్డాడు. (ఫొటో నెం. 849)

➩ దండే పూర్ణసాయి (16 సం॥) :- తండ్రి చిన్న వయసులోనే మృతి చెందడం, కన్నతల్లి పట్టించుకోకుండా వెళ్లిపోడంతో ఆధరణ కరువైన పూర్ణసాయి రోడ్లపై తిరిగేందుకు చెడు సహవాసాలతో రోడ్లపై సంచరించేందుకు అలవాటుపడ్డాడు. (ఫొటో నెం. 850)

ఈ సందర్భంగా బాల బాలికలను నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారు స్వయంగా పలకరించి, వారి నివాస ప్రాంతం, ఇంటి నుండి బయటకు దారితీసిన పరిస్థితులు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలు అడిగి తెలుసుకుని, రోడ్లపై తిరుగకుండా చక్కగా చదువుకుని వృద్ధిలోకి రావాలని తెలియజేశారు.

కార్యక్రమంలో లా & ఆర్డర్ డిసిపి శ్రీ డా॥ గజరావు భూపాల్ ఐపిఎస్, అడ్మిన్ డిసిపి శ్రీ జె.బ్రహ్మారెడ్డి ఐపిఎస్, సి.ఎస్.డబ్ల్యూ. డిసిపి శ్రీ అమర్‌నాథ్ మరియు వివిధ డివిజన్‌ల ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు ఎస్.ఐ.లు పోలీస్ సిబ్బంది మరియు ఛైల్డ్ వెల్‌ఫేర్ ఆర్గనైజేషన్ మరియు బాలల సంరక్షణకు సంబంధించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

-- xx --